క్లుప్తంగా

ఎన్‌యూజే నేషనల్ కౌన్సిల్ సభ్యుడిగా రాజన్న



వరంగల్: నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ – ఇండియా (ఎన్‌యూజే (ఐ)) జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ప్రింట్ మీడియాలో జర్నలిస్ట్‌గా పనిచేస్తున్న చెందిన పోతరవేని రాజన్న నియామకమయ్యారు. ఇటీవల ఒడిస్సా రాష్ట్రంలోని జజ్బూర్ నగరంలో నిర్వహించిన ఎన్‌యూజే(ఐ) జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ఈ నిర్ణయం తీసున్నట్లు యూనియన్ నేషనల్ సెక్రటరీ జనరల్ సురేష్ శర్మ పేర్కొన్నారు.

కుట్టుమిషన్ల అందజేత



హన్మకొండ చౌరస్తా: అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ అనితారెడ్డి ఆధ్వర్యంలో మంచికంటి పద్మజ, డాక్టర్ రవీంద్ర సహకారంతో కాకాజీకాలనీలోని తేజ కంటి ఆస్పత్రిలో రజిత, మానసకు కుట్టు మిషన్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఆ కుటుంబానికి చేదోడుగా ఉంటారని అన్నారు. కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న ఇద్దరు మహిళలకు కుట్టుమిషన్లను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కల్యాణ్, ఈశ్వర్, మురళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతే ప్రారంభించాలి

నయీంనగర్: నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రధాని నరేంద్ర మోదీ కాకుండా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాత్రమే ప్రారంభించాలని కేటీఆర్ ఫ్యాన్స్ యూత్ సొసైటీ అధ్యక్షుడు మేకల యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న జరగనున్న నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు స్వాతంత్ర్య సమర యోధులు, దళిత, ఎస్టీ, బీసీ నేతలను ఆహ్వానించాలని పేర్కొన్నారు. నూతన పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలని, అన్ని రాష్ట్రాల్లో దళితబంధు పథకాన్ని అమలు చేయాలని కోరారు.

నిబంధనలను పట్టించుకోని 'ఏకశిల'

హన్మకొండ: కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారులు.. ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోని ఏకశిల విద్యాసంస్థల కొమ్ము కాస్తున్నారని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ ఆరోపించారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను పట్టించుకోకుండా ఏకశిల విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపుల పేరుతో తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నిబంధనలను తుంగలో తొక్కి తరగతులు నిర్వహిస్తున్న ఏకశిల విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ విషయమై హనుమకొండ కలెక్టరేట్‌ను సోమవారం ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా నాయకులు పగిడిపల్లి పవన్ గౌడ్, భగత్, రమేష్, జగన్, వెంకటేష్ పాల్గొన్నారు.

పెట్రోల్‌పంప్ కార్మికులపై దాడి

హసన్‌పర్తి: చింతగట్టు క్యాంప్ సమీపంలోని ఓ పెట్రోల్‌పంప్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులపై దాడి జరిగింది. గురువారం రాత్రి డీజిల్ పోసుకోవడానికి నలుగురు వ్యక్తులు ఆటోలో వచ్చారు. అయితే సదరు కార్మికుడు డీజిల్ పోశాడు. డీజిల్ పోయలేదని కార్మికుడిపై దుర్భాషలాడుతూ వారు గొడవకు దిగారు. ఈ సందర్భంగా కార్మికుడిపై దాడికి దిగాడు. గొడవను సద్దుమనిగించడానికి వచ్చిన వ్యక్తిపై కూడా వినియోగదారుడు దాడి చేశారు. ఈ సంఘటన జరుగుతున్న సమయంలో నిర్వాహకుడు పంపు వద్దే ఉన్నాడని కార్మికులు తెలిపారు. పంపు నిర్వాహకుడి ఎదుటే దాడి జరిగినప్పటికీ మౌనం వహించడం పట్ల కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాలుగు గంటలపాటు సేవలు నిలిపివేశారు. అంతకుముందే బాధితుడు శ్రీనివాస్.. కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

తల్వార్‌తో యువత వీరంగం

ఖిలా వరంగల్: ఓ యువకుడి పుట్టిన రోజు వేడుకల్లో తల్వార్‌తో కేక్ కట్ చేసి హల్‌చల్ సృష్టించారు. వరంగల్ 33వ డివిజన్ పెరకవాడలోని ప్రతాపరుద్ర కల్యాణ మండపం వీధిలో గురువారం అర్ధరాత్రి దాటాక కొందరు యువకులు కేకలు వేస్తూ తల్వార్‌తో కేక్ కట్ చేశారు. వారి అరుపులతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకోవడంతో యువత పరుగులు తీశారని తెలిసింది.

నేడు సంఘీభావ ప్రదర్శన

ఐనవోలు: ప్రభుత్వ దమన నీతికి నిరసనగా టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో హనుమకొండ అమరవీరుల స్తూపం వద్ద శనివారం సంఘీభావ ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చుంచుకాల లింగారావు ఓ ప్రకటనలో తెలిపారు.

ఫ్రూట్ జ్యూస్.. అదిరే టేస్ట్

- ఆసక్తి చూపుతున్న నగరవాసులు
- వేసవిలో కిటకిటలాడుతున్న సెంటర్లు



కాజీపేటలోని ఫ్రూట్‌జ్యూస్ సెంటర్‌లో జ్యూస్ తాగుతున్న నగరవాసులు

కాజీపేట: వేసవి ఎండల తాపం నుంచి ఉపశమనం పొందేందుకు నగర ప్రజలు చల్లని పండ్ల రసాలు తాగడానికి ఆసక్తి చూపుతున్నారు. ఆంధ్రా ప్రాంతం నుంచి వలస వచ్చిన కొందరు వ్యాపారులు ఫ్రూట్ జ్యూస్ స్టాళ్లను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. సీజనల్ బిజినెస్ కావడంతో ఫిబ్రవరిలోనే కుటుంబ సభ్యులతో సహా వచ్చి పట్టణంలో మకాం వేసి వ్యాపారాన్ని మొదలు పెట్టారు. వేసవి కాలం ప్రారంభం కాగానే వ్యాపారాన్ని ముమ్మరం చేశారు.

కిటకిటలాడుతున్న జ్యూస్ సెంటర్లు

ట్రైసిటీగా పిలువబడే వరంగల్ నగరంలో ఎటు చూసినా పలు ఫ్రూట్ జ్యూస్ దుకాణాలు కనిపిస్తాయి. నిత్యం ఫ్రూట్ జ్యూస్ తాగడానికి వచ్చే వారితో సెంటర్లు కిటకిటలాడుతున్నాయి. ప్రత్యేకంగా అన్ని రకాల పండ్లతో తయారు చేసిన ఫ్రూట్ జ్యూస్, మజ్జిగ, స్పెషల్ లస్సీ, నిమ్మరసం, బాదం పాలు, ఫలుదా, ఫ్రూట్ సలాడ్‌తో పాటు వివిధ పండ్ల రసాలు లభ్యమవుతున్నాయి. నగర ప్రజలే కాకుండా పలు ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చేవారు ప్రత్యేకంగా ఫ్రూట్ జ్యూస్ సెంటర్‌కు జ్యూస్ తాగడానికి వస్తుండడంతో అవి కళకళలాడుతున్నాయి. ఒక్కోసారి జ్యూస్ తాగడానికి ఐదు నిమిషాలకుపైగా సమయం పడుతుందంటే వేసవిలో జ్యూస్‌కు ఉన్న గిరాకీ ఎంతో అర్థం చేసుకోవచ్చు. గ్లాసును బట్టి జ్యూస్‌ల ధరలను వ్యాపారులు నిర్ణయించారు. రూ.5నుంచి రూ.20 ఆపై ధరల్లో వివిధ రకాల జ్యూస్‌లు అందుబాటులో ఉన్నాయి. కాగా, రోజుకు ఖర్చులన్నీ పోనూ రూ.2వేల వరకు లాభం వస్తోందని యజమానులు చెబుతున్నారు. కాజీపేట పట్టణంలోనే దాదాపుగా 25కు పైగా ఫ్రూట్‌జ్యూస్ కేంద్రాలు వెలిశాయంటే వ్యాపారాలు వేసవిలో చక్కగా సాగుతున్నాయని చెప్పవచ్చు.

ఫ్రూట్ సలాడ్ బాగుంటది



ఈ జ్యూస్ సెంటర్‌లో అన్నింటి కంటే ఫ్రూట్ సలాడ్‌తోపాటు ఫలుదా జ్యూస్ చాలా బాగుంటుంది. వాటితో పాటు మిగతా ఫ్రూట్ జ్యూస్‌లు తాజాగా తయారు చేస్తారు. చల్లగా ఉండటంతో చాలామంది ఇక్కడ తాగడమే గాకుండా ఇంటికి తీసుకెళ్తున్నారు.

– సుబ్బు, రహమత్‌నగర్

వ్యాపారం బాగుంది



బతుకుదెరువు నిమిత్తం వచ్చి ఫ్రూట్ జ్యూస్ స్టాల్‌ను ఏర్పాటు చేసుకున్నాం. నాణ్యత ప్రమాణాలు పాటిస్తుండడంతో ప్రజలు ఫ్రూట్ జ్యూస్‌ను ఆదరిస్తున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఎక్కువగా ఫ్రూట్ జ్యూస్‌ను తాగడానికి ఇష్టపడతారు. ధరలు కూడా అందరికి అందుబాటులో ఉంచాం.

– జి.మహేష్, వ్యాపారి

ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తే రిజిస్ట్రేషన్ రద్దు



టిప్పర్‌ను సీజ్ చేసిన ఎంవీఐ వెంకన్న

ఖిలా వరంగల్: రవాణాశాఖ నిబంధనలను అతిక్రమించి ఓవర్‌లోడుతో రేగడిమట్టి, ఇసుక, మొరం తరలిస్తే డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తామని వరంగల్ ఎంవీఐ వెంకన్న హెచ్చరించారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లో వరంగల్ ఆర్టీఏ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తున్న రెండు రేగడిమట్టి లోడ్ టిప్పర్లపై కేసు నమోదు చేసి ఆర్టీఏ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఎంవీఐ వెంకన్న మాట్లాడుతూ ఆత్మకూర్ మండలం గుడెప్పాడు సమీపంలోని చెరువుల్లో నుంచి ఖిలా వరంగల్ మండలం నక్కపెల్లి గ్రామ పరిసరాల్లో వెలిసిన ఇటుక బట్టీలకు అక్రమంగా తరలిస్తున్న రేగడిమట్టి లోడ్‌తో వెళ్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. వాహనదారులు నిబంధనలు పాటించకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ చౌరస్తా: భారత ప్రభుత్వం అందజేసే పద్మ అవార్డులకు జిల్లాలోని వివిధ రంగాల్లో సేవలందించిన వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి అశోక్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళలు, ఆటలు, సంఘసేవ, విద్య, వైద్య, విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక, పరిశ్రమలు, వ్యాపార తదితర రంగాల్లో విశిష్టమైన సేవలందించిన వారికి పద్మ అవార్డులను ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు https://www.padmaawards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇందులో ప్రెస్‌క్లిప్స్, ఫొటోలతో సహా పీడీఎఫ్ ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వీటి కాపీలు నాలుగు సెట్లు ఈ నెల 28వ తేదీన హనుమకొండలోని కేడీసీ ఎదురుగా ఉన్న జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో స్వయంగా అందజేయాలని కోరారు. 28వ తేదీ సాయంత్రం 5 గంటల తర్వాత వచ్చిన దరఖాస్తులను తిరస్కరిస్తారని పేర్కొన్నారు.

తప్పుడు కాగితాలతో ప్లాట్ల విక్రయం

కాజీపేట: ఇంటి నివేశన స్థలాలను కాజేసి ఇబ్బందులకు గురి చేస్తున్న కబ్జాదారుడిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కటకం కిషన్ అనే రిటైర్డ్ ఉపాధ్యాయుడికి చెందిన రెండు ప్లాట్లను కటకం సంతోష్ అనే వ్యక్తి తప్పుడు కాగితాలు సృష్టించి ఇతరులకు విక్రయించినట్లుగా నిర్ధారణ కావడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల అవినీతిని ఎండగట్టాలి



కాంగ్రెస్ సోషల్ మీడియా నాయకులతో సుస్మిత పటేల్

వరంగల్: వరంగల్ తూర్పులో అధికార పార్టీ నాయకులు చేసే భూకబ్జాలు, దౌర్జన్యాలు, ఆగడాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో ఎండగడుతూ వైరల్ చేయాలని కొండా దంపతుల కుమార్తె కొండా సుస్మిత పటేల్ సూచించారు. హనుమకొండ రాంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తూర్పులో అధికార పార్టీ నాయకుల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని అన్నారు. అమాయకుల ప్లాట్ల కబ్జాలకు పాల్పడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఎద్దేవాచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పట్టెం నవీన్, రమేష్ యాదవ్, నియోజకవర్గంలోని సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



చేయూతనందిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మృతిచెందిన ముచ్చర్లకు చెందిన మట్టెడ ఎర్రగట్టు కుటుంబానికి స్థానిక నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి చేయూతనందించారు. ఈమేరకు బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి బియ్యంతోపాటు నిత్యావసర వస్తువులు అందించారు. కార్యకమంలో మట్టెడ పాల్, శ్రవణ్, బొక్క ప్రవీణ్, రఘు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది

ఖిలా వరంగల్: పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఓగ్లాపూర్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ డీజీఎం, స్టేషన్ ఇన్‌చార్జ్ సమ్మయ్య సూచించారు. స్వచ్ఛ పక్వాడ –2023లో భాగంగా ఖిలా వరంగల్ మధ్యకోట ఉత్తర ద్వారం వద్ద ఓగ్లాపూర్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వరంగల్ ఆధ్వర్యంలో పరిసరాలను శుక్రవారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిశుభ్రత కారణంగా వ్యాధులు దరిచేరే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈక్రమంలో ప్రతీఒక్కరు స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్ రావు, ఎండీ సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మడికొండలో ఉచిత వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

మడికొండ: మడకొండలోని మున్సిపల్ కార్యాలయంలో సెయింట్ ఆన్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో, ఫిజికల్ సెక్యూరిటీ ఫోర్స్ (పీఎస్ఎఫ్) సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది విశ్వభరత్‌రెడ్డి, శారోని, శివ, అమల, పుష్ప, రవీందర్, విజయ్, కార్తీక్, వినయ్, సందీప్, శ్రావణ్, మహేష్, నవీన్, రామస్వామి, సుమన్, సంతోష్, సతీష్ పాల్గొన్నారు.

1న రెడ్డి కులస్తుల ఆత్మీయ సమ్మేళనం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మడికొండ: జూన్ 1వ తేదీన కాజీపేట మండలం మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న రెడ్డి కులస్తుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని రెడ్డి జేఏసీ నాయకులు కోరారు. ఈమేరకు ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మడికొండలోని రెడ్డి పంక్షన్ హాల్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్ సాధనే ధ్యేయంగా సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈక్రమంలో జిల్లాలోని రెడ్డి కుల బాంధవులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రెంటాల కేశవరెడ్డి, మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నిమ్మ సుదర్శన్‌రెడ్డి, రాదారపు సంజీవరెడ్డి, అర్జుల కిషన్‌రెడ్డి, ఆవాల నరోత్తమ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హస్తకళలు, కళాకారులను ఆదరించాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న గంగు ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్: హస్తకళలు, కళాకారులను ప్రజలు ఆదరించాలని తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ సూచించారు. వారసత్వంగా వచ్చిన సంపదగా హస్తకళలు నేటికీ కనువిందు చేస్తున్నాయని, వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. హనుమకొండలోని హయగ్రీవచారి మైదానంలోని కాళోజీ కళాక్షేత్రం ఎదురుగా భారత దేశ హస్తకళ, చేనేత వస్త్ర ప్రదర్శన శుక్రవారం సాయంత్రం ప్రారంభమైంది. జీవనజ్యోతి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఏర్పాటు చేసిన ప్రదర్శన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉపేంద్రశర్మ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అతిన్‌కుమార్ జైస్వాల్ మాట్లాడుతూ ఈ ప్రదర్శన శుక్రవారం నుంచి వచ్చే జూలై 26వ తేదీ వరకు రెండు నెలల పాటు కొనసాగుతుందని వివరించారు. 75కు పైగా స్టాళ్లు ఉన్నాయని, వివిధ రకాల హస్తకళారూపాలు, చేనేత వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీటీడీ కోఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తి, రఘువీర్, స్టాళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

అంగవైకల్య రిజర్వేషన్ వర్తింపజేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ, నాయకులు

విద్యారణ్యపురి: క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్ల నియామకాల్లో, బదిలీల్లో అంగవైకల్య రిజర్వేషన్‌ను వర్తింపజేయాలని వీ – జేఏసీ బాధ్యులు నల్లెల రాజయ్య, బోనగిరి రాములు, ధనుంజయ్ కుమార్, సంగాల శ్రీనివాస్ కోరారు. ఈమేరకు హనుమకొండలో డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం డీఈఓతో కలిసి దివ్యాంగుల అట్రాసిటీ చట్టం పోస్టర్‌ను జేఏసీ నాయకులు ఆవిష్కరించారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి



బాండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్

రామన్నపేట: చేనేత కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పేర్కొన్నారు. గోపాలస్వామి గుడి తోటమైదానంలో చేనేత కార్మికులకు రూ.5 లక్షల బీమా బాండ్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత వృత్తిని కొనసాగించే నేతలన్నలకు సరిపడా పనిని కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో చేనేతలకు సబ్సిడీ నెలనెలా ఖాతాల్లో నేరుగా పడే విధంగా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మరావు, పంతగాని శ్రీనివాస్, కొలిపాక మధునయ్య, చిన్నభద్రయ్య, కుమారస్వామి, రవిరాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలు ఖాళీ చేసి సహకరించాలి



ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణదారులతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

కాజీపేట: ప్రభుత్వ స్థలాల్లో అనుమతి లేకుండా గుడిసెలు వేసుకోవడం తగదని, వెంటనే స్థలాలను ఖాళీ చేసి అధికారులకు సహకరించాలని ఏసీపీ పి.శ్రీనివాస్ సూచించారు. కాజీపేట పట్టణ శివారులో ఉన్న ఇందిరమ్మ కాలనీలో కొంతమంది వ్యక్తులు అనధికారికంగా గుడిసెలు వేసుకున్నట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దశరథ రామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీపీ శుక్రవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఏదైనా సమస్య ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని అన్నారు. సమస్యలు సృష్టించాలని ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సార్ల రాజుతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

4న కొత్తగూడెంలో సీపీఐ ప్రజాగర్జన



ప్రజాగర్జన సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: జూన్ 4న కొత్తగూడెంలో లక్ష మందితో సీపీఐ ప్రజాగర్జన పేరిట బహిరంగ సభను నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి తెలిపారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియాతో కలిసి ప్రజాగర్జన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో సీపీఐ పోటీకి సిద్ధమవుతోందని స్పష్టం చేశారు. ఇంటింటికి సీపీఐ కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయని వివరించారు. బహిరంగ సభకు వరంగల్ నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో గన్నారపు రమేష్, ఎలేందర్, ల్యాదెల్ల శరత్, రవి, అక్బర్, చందు, యాకూబ్, రాజేందర్, యాకూబ్, రమేష్, నరేష్, కళాకారులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు అభినందనల వెల్లువ



కమిషనర్‌కు మొక్క అందజేస్తున్న శ్రద్ధ శుక్ల



కమిషనర్‌కు మొక్క అందిస్తున్న కార్పొరేటర్

వరంగల్ అర్బన్: ఇటీవల బాధ్యతలు చేపట్టిన గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను పలువురు కలిసి అభినందనలు తెలిపారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ట్రైనీ ఐఏఎస్ శ్రద్ధ శుక్ల శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్క అందజేశారు.

కమిషనర్‌ను కలిసిన యూనియన్ నాయకులు

బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను సీఐటీయూ, టీఎంఆర్‌పీఎస్, జేఏసీ, టీఎంఈడబ్ల్యూఏ, బీఆర్ఎస్‌యూ నాయకులు వేర్వేరుగా కలిశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.ఉప్పలయ్య, వేల్పుల ధర్మరాజు, సింగారపు బాబు, రాజారపు భాస్కర్, బరుపట్ల మహేష్, పుల్ల దేవేందర్, పాపయ్య, రమేష్, బీఆర్ఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు కిషోర్ కుమార్, శనిగరపు శ్యామ్, సుధాకర్, నాగరాజు, కుమ్మరి అశోక్, మోహన్, రవీందర్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు. అలాగే, కమిషనర్‌ను అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ జన్ను భాస్కర్, ప్రతినిధులు హకీమ్ నవీద్, దొమ్మటి ప్రవీణ్ తదితరులు కలిశారు.

కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ స్వరూపరాణి

హన్మకొండ: ఇటీవల బాధ్యతలు చేపట్టిన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను బల్దియా కార్యాలయంలో 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బహుజన రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యం



నియామక పత్రం అందజేస్తున్న శనిగరపు రాజు

హన్మకొండ: బహుజనలకు రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజన సమాజ్ పార్టీ ముందుకు సాగుతోందని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ సారథ్యంలో బీఎస్పీ రోజురోజుకు బలపడుతోందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు బీఎస్పీకి అండగా నిలవాలని కోరారు. అనంతరం నగరంలోని 30వ డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా బొల్లె సారంగపాణి, ఉపాధ్యక్షులుగా మహేష్, రాజును ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు బి.సారయ్య, ఒంటేరు చక్రి, పసుల వినయ్, అంబేడ్కర్ పాల్గొన్నారు.

నేడు దివ్యాంగుల ప్రజావాణి

హన్మకొండ: దివ్యాంగుల ప్రజావాణిని ఈనెల 27న నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా సంక్షేమాధికారి (ఇన్‌చార్జ్) కె.మధురిమ తెలిపారు. హనుమకొండలోని జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 11గంటలకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో వివరించారు. అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.